ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు

మాట్లాడుతున్న జిల్లా సాధారణ పరిశీలకుడు సమీర్ మాధవ్ కుర్మేటి

- ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి
- జిల్లా సాధారణ పరిశీలకుడు సమీర్ మాధవ్ కుర్మేటి

మెదక్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): ఎన్నికల నియమావళిలో భాగంగా ఆదివారం సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్, జిల్లా ఎస్పీ డాక్టర్ బాలస్వామి, జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు, పోలీస్ అధికారులతో ఎన్నికల ఏర్పాట్లుపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన జిల్లా సాధారణ పరిశీలకుడు సమీర్ మాధవ్ కుర్మేటి, వ్యయ పరిశీలకుడు సునీల్ కుమార్ రాజ్వాన్ని, జిల్లా పోలీస్ పరిశీలకుడు, డీఐజీ రామేశ్వర్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల నియమావళి అమలులో భాగంగా ఎన్నికల ప్రక్రియ, ఎన్నికల ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా ఎస్పీ, పరిశీలకులకు జిల్లా ఎన్నికల ఏర్పాట్లు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా సాధారణ పరిశీలకుడు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఈసీఐ పరిధిలో పనిచేయాలని, అన్ని శాఖల టీమ్‌లు సమన్వయంతో కలసి పనిచేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ నిర్వహణ ఏర్పాటు పూర్తిచేయాలి తెలిపారు. ఓటరు స్లిప్పుల పంపిణీ పర్యవేక్షణ కోసం, ఫిర్యాదులు ఉంటే వాటి పరిష్కారానికి నోడల్ అధికారిని నియమించాలని తెలిపారు. అధికారులకు ఏదైనా అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవాలన్నారు. అభ్యర్థి ఖర్చు నమోదు చేయాలని, వీడియో కెమెరాలో రికార్డ్ చేయాలన్నారు. ఓటరుకు ఎలాంటి సమస్య రాకుండా చూడాలన్నారు. జిల్లా పోలీస్ పరిశీలకుడు మాట్లాడుతూ పోలీస్ శాఖ ఎన్నికల విధులను సమర్థవంతగా నిర్వహించాలని, ఎన్నికల్లో పోలీస్ పాత్ర చాలా గొప్పదని,ప్రజలకు పోలీస్ లు మంచి ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ చేయాలని,సమాజానికి మంచి సందేశం ఇవ్వలను,పోలీస్ ఇతర శాఖల మధ్య సమన్వయం తో ఉండాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో భద్రత పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఎస్పీ అనురాధ, సంగారెడ్డి ఎస్పీ రూపేష్, అదనపు కలెక్టరు వెంకటేశ్వర్లు, సిద్దిపేట అదనపు కలెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, గరిమా అగర్వాల్ ఎన్నికల నోడల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లను సందర్శించిన అబ్జర్వర్

మెదక్ అర్బన్, ఏప్రిల్ 28: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మెదక్ జిల్లా పోలీస్ అబ్జర్వర్ డీఐజీ డాక్టర్ రామేశ్వర్‌సింగ్ జిల్లాలో సందర్శించి పోలింగ్ స్టేషన్లను అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికలను ప్రభావితం చేసే ఎలాంటి అంశమైన తమ దృష్టికి వచ్చిన క్షుణ్ణంగా పరిశీలించాలని ఎన్నికల పోలీస్ పరిశీలకులు ఆదేశించారు.

కరెంట్ సమస్య సృష్టిస్తే చర్యలు

– మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

పాపన్నపేట, ఏప్రిల్ 28: కావాలని కరెంట్ సమస్యలు సృష్టిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు హెచ్చరించారు. ఆదివారం మండలంలోని చీకోడ్, పాతలింగాయిపల్లి, కొత్త లింగాయిపల్లి, సోమ్లతండా, రాజ్యతండా, నర్సింగ్‌రావు పల్లి తండా తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. వేసవిలో కరెంట్ కోతలు లేకుండా చూడాలన్నారు. పర్యటనలో కిసాన్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు ప్రశాంత్ రెడ్డి, గౌస్, ఆబేద్, రాజు, నారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఐటీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హరితహారం

మనోహరాబాద్, ఏప్రిల్ 28: మండలంలోని గౌతోజిగూడెంలో సీఎంఆర్‌టీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హరితహారం, స్వచ్ఛభారత్ కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. వీధుల్లోని చెత్తాచెదారాన్ని ఏరి, శుభ్రం చేశారు. అనంతరం గ్రామంలో హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, మాజీ ఉప సర్పంచ్ రేణుకమార్, సీఎంఆర్ఐటీ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, జేఎన్‌టీయూహెచ్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ శోభరాణి, ప్రోగ్రాం ఆఫీసర్ నిఖిల, సతీశ్, వలంటీర్లు పాల్గొన్నారు.

మేడేను విజయవంతం చేయాలి

మనోహరాబాద్, ఏప్రిల్ 28: కార్మికుల హక్కులను కాపాడుకోవాలని, మేడేను విజయవంతం చేయాలని పంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసీఫ్ పిలుపునిచ్చారు. ఆదివారం మనోహరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ గ్రామాల కోసం పని చేస్తున్నారని, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత సమస్యలపై ప్రభుత్వంతో పోరాడాలని పిలుపునిచ్చారు.

భక్తులతో కిటకిటలాడిన మెదక్ చర్చి

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 28: మెదక్ మహాదేవాలయం (చర్చి) ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. భక్తులనుద్దేశించి చర్చి ప్రేసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య దైవ సందేశం వినిపించారు. పాస్టర్లు డేవిడ్, జైపాల్, సువర్ణ భక్తులను ఆశీర్వదించారు. భక్తులు యేసయ్యకు మొక్కులు తీర్చుకుని చర్చి ఆవరణలోని చెట్లకింద వంటావార్పు చేసుకున్నారు. ప్రార్థనల్లో సీఎస్ఐ కమిటీ సభ్యులు గంట సంపత్, సువర్ణడగ్లస్, నోబుల్‌సన్, సంశాన్ సందీప్, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ మోసం

నల్ల పోచమ్మ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, చిత్రంలో మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి సతీమణి ప్రణీతారెడ్డి తదితరులు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 28: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలుచేయలేని పరిస్థితిలో ఉన్నదని, మరోసారి పార్లమెంట్ ఎన్నికల్లో మోసం చేయడానికి వస్తున్నదని మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి సతీమణి ప్రణీతారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నల్లపోచమ్మ కాలనీ, ఆటోనగర్‌లో బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ ఆంజనేయులు, మున్సిపల్ కౌన్సిలర్లు సులోచన ప్రభురెడ్డి, లలిత, గాయత్రి, కృష్ణారెడ్డి, ఆర్కె శ్రీనివాస్, కిశోర్, జయరాజ్ తదితరులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. తెలంగాణ హక్కుల కోసం కేంద్రంతో కొట్లాడిన బీఆర్ఎస్ పార్టీకే ఓటెయ్యాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ పాలనలో ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలు, పథకాలను ఓటర్లకు వివరించారు. ప్రచారంలో వెల్దుర్తి మాజీ ఎంపీపీ సునీతా ప్రతాప్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ చంద్రకళ, నాయకులు స్నేహ, రాధిక, శ్యామ్‌సుందర్, వేణు, గంగులు, శేఖర్, రుక్మల్‌చారి పాల్గొన్నారు.

క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే కొత్త

క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట, ఏప్రిల్ 28: రోడ్డు ప్రమాదంలో గాయపడి, సికింద్రాబాద్ యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న ఏసు, స్వామిని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. చేగుంట మండలం బి.కొండాపూర్‌కు చెందిన ఏసు, స్వామి మెదక్‌లోని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి నామినేషన్ కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తుండగా, కొంటూర్ సమీపంలోని చెరువు కట్ట వద్ద చేగుంట వైపు నుంచి మెదక్ వైపు వస్తున్న డ్రైవర్ అజాగ్రత్తగా నడిపి ఏసు, స్వామి వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ప్రమాదంలో ఇరువురికి గాయాలు కావడంతో సికింద్రాబాద్ యశోద దవాఖానకు తరలించారు. వైద్యులతో మాట్లాడి ఏసు, స్వామికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ జిల్లా నాయకుడు రాజిరెడ్డి తదితరులున్నారు.

అర్పిత మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరాలి

నర్సంపల్లిలో అర్పితను సన్మానిస్తున్న వివిధ సంఘాల నేతలు

తూప్రాన్, ఏప్రిల్ 28: ఇండియన్ సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో దేశవ్యాప్తంగా 639వ ర్యాంకు సాధించిన తూప్రాన్ మండలం నర్సంపల్లికి చెందిన కోలా అర్పితను పలువురు నేతలు ఆదివారం సన్మానించారు. అర్పితకు తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని, భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహులు నాయక్, ఆర్ఎంపీ, పీఎంపీల అధ్యక్షుడు అప్సర్, కిష్టాపూర్ పాఠశాల హెచ్ఎం లక్ష్మణ్, నాయకులు బుడ్డ భాగ్యరాజ్, విశ్వనాథ్, మహేశ్, బిక్కునాయక్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాపై నిఘా

- జిల్లా ఎస్పీ డాక్టర్ బాలస్వామి

మెదక్ అర్బన్, ఏప్రిల్ 28: ఎంపీ ఎన్నికల నిర్వహణ సందర్భంగా జిల్లాలో ఎన్నికల నియమావళిని జిల్లా యంత్రాంగం పటిష్టంగా అమలు చేస్తున్నట్లు, సోషల్ మీడియా సైట్లపై ప్రత్యేక నిఘా ఉంచామని ఎన్నికల నియమావళి అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డాక్టర్ బాలస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోషల్ మీడియా మానిటరింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి, పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. ఎవరైనా రాజకీయ పార్టీలను ఉద్దేశించి సోషల్ మీడియాలు వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ మొదలగు వాటిలో అనుచితమైన వాఖ్యలు, అనుచిత పోస్టులు పెడితే అలాంటి వారి ఎలక్ట్రానిక్ డివైజ్‌లు సీజ్ చేసి వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో పేపర్ బాలరాజు మృతి

పేపర్ బాలరాజు (ఫైల్)

చేగుంట, ఏప్రిల్ 28: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన ఘటన మండలంలోని కర్నాల్‌పల్లి ఎల్లమ్మ దేవాలయ సమీపంలోని చిన్నశివునూర్ చౌరస్తా వద్ద ఆదివారం జరిగింది. చేగుంట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంటలో నివసిస్తున్న న్యాలపల్లి బాలరాజు (45) కర్నాల్‌పల్లి ఎల్లమ్మ ఆలయం వద్దకు వెళ్లి చేగుంటకు తన ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో కారు తగిలి కిందపడ్డాడు. దీంతో ఎదురుగా వస్తున్న కంటైనర్ టైరు కింద పడి బాలరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు చేగుంట పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్సై బాలరాజు తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

కుంటలో పడి ఒకరు మృతి

వెల్దుర్తి, ఏప్రిల్ 28: ప్రమాదవశాత్తు కుంటలో పడి ఒకరు మృతి చెందిన ఘటన మాసాయిపేట మండలంలోని హకీంపేటలో ఆదివారం జరిగింది. వెల్దుర్తి ఎస్సై నవత తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లొడబోయిన శ్రీనివాస్(55) ఈ నెల 26న సాయంత్రం హల్దీప్రాజెక్టు వద్ద ఆరబోసిన వడ్లను తరలించడానికి వస్తున్నా అని చెప్పి ఎంతకు రాలేదు. దీంతో ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం గ్రామానికి చెందిన పలువురు మల్లకుంటలో శ్రీనివాస్ మృతదేహాన్ని గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. శ్రీనివాస్ ప్రమాదశాత్తు మార్గమధ్యలో మల్లకుంటలో పడి మృతి చెందాడు. శవ పంచనామా చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి భార్య లింగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవత తెలిపారు.

బీజేపీ గెలిస్తే అదానీ, అంబానీలకే మేలు

- మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు

చేగుంటలో మాట్లాడుతున్న నీలం మధు

చేగుంట, ఏప్రిల్ 28: బీజేపీ గెలిస్తే సామాన్యులకు కాదు అదానీ, అంబానీలకు మేలు జరుగుతుందని మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలుచేస్తున్నారన్నారు. శనివారం రాత్రి చేగుంట, నార్సింగిలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్‌రావు, మెదక్ డీసీసీ ఇన్‌చార్జి ఆంజనేయులుగౌడ్, దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి రోడ్ షోతో నిర్వహించారు. నార్సింగి రోడ్‌షోలో ఎంపీటీసీ సత్యనారాయణ, బీఆర్ఎస్ నాయకుడు రాజేశ్ నీలం మధు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. చేగుంట, నార్సింగి కాంగ్రెస్ మండలాల అధ్యక్షులు నవీన్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ మాసుల శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రజనక్ ప్రవీణ్‌కుమార్, వైస్ చైర్మన్ ఎన్నం రాజేందర్‌రెడ్డి, భాస్కర్, ఆమదేందర్‌రెడ్డి, విజయపాల్‌రెడ్డి, జూకంటి రాజు, వెంగళ్‌రావు, సంద్రుగు శ్రీకాంత్, వెంకటేశం, మధు, భాగ్యరాజు, సాయి, వెంకటస్వామి, మైనార్టీ నాయకులు సాబేర్, నదీమ్, మహ్మద్‌అలీ, అంజిరెడ్డి, హరిప్రసాద్, అంజాగౌడ్, జగన్‌గౌడ్, శ్రీకాంత్, బల్‌రాం, సంపత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, గోవర్ధన్ పాల్గొన్నారు.

తెలంగాణ కోసం పోరాడే ఏకైక పార్టీ బీఆర్ఎస్



మనోహరాబాద్‌లో ఇంటింటా ప్రచారం చేస్తున్న హేమలతాశేఖర్‌గౌడ్, నాయకులు

లక్ష్మాపూర్‌లో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ మెదక్ ఇంచార్జి కంటారెడ్డి

- మెదక్ జడ్పీ చైర్‌పర్సన్ రాకల హేమలతాశేఖర్‌గౌడ్

మనోహరాబాద్, ఏప్రిల్ 28: తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం పోరాడే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని మెదక్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రాకల హేమలతాశేఖర్‌గౌడ్ అన్నారు. మనోహరాబాద్‌లో కారు గుర్తుకు ఓటేసి మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఇంటింటా ప్రచారం చేశారు. గడపగడపకూ వెళ్లి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. దొంగ హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంపీ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే ఇప్పటికి అమలుపుతున్నాయని, కొత్తగా ఏ పథకం కూడా ఆచరణలోకి రాలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పురం మహేశ్ ముదిరాజ్, ఎంపీటీసీ లతావెంకటేశ్‌గౌడ్, ముదిరాజ్ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడు హరిబాబు, శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్‌లు రేణుకుమార్, మహేందర్‌గౌడ్, నాయకులు ఉదయ్‌రంజన్‌గౌడ్, సాయిరాం, భిక్షపతి, లక్ష్మణ్, శ్రీనివాస్, కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

మెదక్‌లో బీఆర్ఎస్ విజయం తథ్యం

రామాయంపేట, ఏప్రిల్ 28: రాబోయే ఎంపీ ఎన్నికలలో బీఆర్ఎస్ విజయం పక్కా అని మెదక్ నియోజక వర్గ ఇన్‌చార్జి కంటారెడ్డి తిరుపతి రెడి, పురపాలిక చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ సరాఫ్ యాదగిరి అన్నారు. ఆదివారం మండలంలోని లక్ష్మాపూర్, కాట్రియాల, పర్వతాపూర్ గ్రామాల్లోని బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించి పలు సూచనలు సలహాలిచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ మెదక్ ఎంపీగా వెంకట్రామిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యకర్తలు సైనికుల్లా ఉండి బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలన్నారు. మాజీ సర్పంచ్ మైలారం శ్యాములు, స్వామి, దుర్గమ్మ, పట్టణాధ్యక్షుడు గజవాడ నాగరాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కోలాహలంగా బండ్ల ఊరేగింపు

అల్లాదుర్గం, ఏప్రిల్ 28: బేతాళస్వామి జాతర వైభవంగా కొనసాగుతున్నది. ఈ ఉత్సవాలకు ఉమ్మడి మెదక్ జిల్లాతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలిరావచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కోలాహలంగా మారింది. ఆదివారం స్వామికి బండ్ల ఊరేగింపు నిర్వహించారు. బండ్ల ముందు బాజా భజంత్రీలు, ఆట పాటలతో నృత్యాలు చేస్తూ ఊరేగించారు. జాతరలో ఎస్సై ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ బేతాళస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లెగడ్డ నర్సింహులు, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు అంజియాదవ్, ఎంపీటీసీ దశరథ్, నాయకులు సూర్యకుమార్, బలరాంరెడ్డి, అశోక్ గౌడ్, సంపత్ తదితరులు ఉన్నారు.

జాతర బండ్ల ఊరేగింపులో జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

నర్సాపూర్, ఏప్రిల్ 28: గుర్తుతెలియని మహిళ మృతదేహం కుళ్లిన స్థితిలో లభ్యమైన ఘటన నర్సాపూర్ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అర్బన్ పార్క్ వద్ద జరిగింది. ఎస్సై పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫారెస్ట్ అధికారులు శనివారం తమ విధులు నిర్వహిస్తుండగా నర్సాపూర్ అడవిలోని అర్బన్ పార్కు ఎదురుగా ఒక గుర్తుతెలియని మహిళ మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన పరిస్థితుల్లో, గుర్తుపట్టడానికి వీలులేకుండా ఉంది. మృతదేహం నుంచి చీర, గాజులు సేకరించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న శివంపేట్ మండలం నవాబ్‌పేట్ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఆ చీర తమ కటుంబానికి సంబంధించిన రేణుక అనే మహిళదని ఎస్సై పుష్పరాజ్‌కు తెలిపారు. డీఎన్ఏ పరీక్షలు నిర్వహించిన తర్వాత అధికారికంగా వివరాలు వెల్లడిస్తామని ఎస్సై తెలిపారు. మహిళను హత్య చేశారనే కోణంలో విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో యువకుడు మృతి

దయానంద్ (ఫైల్)

రామాయంపేట, ఏప్రిల్ 28: బ్రెయిన్ స్ట్రోక్‌తో ఒక యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన రామాయంపేట మండలం డి.ధర్మారం గ్రామంలో ఆదివారం జరిగింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. డి.ధర్మారం గ్రామానికి చెందిన బూరె దయానంద్(30) టెంట్ హౌస్ నడుపుతూ జీవిస్తున్నాడు. శనివారం గ్రామంలోని ఓ కార్యక్రమంలో పనిచేస్తుండగా తల నొప్పి వస్తుందంటూ కిందపడ్డాడు. వెంటనే రామాయంపేటలో ఓ ప్రైవేటు దవాఖానకు, పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని యశోద దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడికి భార్య, ఓ కూతురు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

పూజలందుకుంటున్న అమ్మవారు, క్యూలో భక్తుల సందడి

కిటకిటలాడిన ఏడుపాయల

పాపన్నపేట, ఏప్రిల్ 28: ఏడుపాయల వనదుర్గా భవానీమాతను ఆదివారం భారీగా భక్తులు చేరుకుని దర్శించుకున్నారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మంజీరా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఒడిబియ్యం, తలనీలాలు, కుంకుమార్చన, బోనాలు సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా దేవాలయ చైర్మన్ బాలాగౌడ్, ఆలయ ఈవో మోహన్‌రెడ్డి, సిబ్బంది రవివీర్ కుమార్, సూర్య శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నరసింహులు, వరుణాచారి, రాజు ఏర్పాట్లు చేశారు. వేద పండితులు శంకర్ శర్మ, పార్థివ శర్మ, మురళీధర్ రాజశేఖర్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. పాపన్నపేట ఎస్సై నరేశ్ బందోబస్తు చర్యలు చేపట్టారు.

సొంతగూటికి బీఆర్ఎస్ నేతలు

హేమలతాశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరిన పాండు, తదితరులు

మనోహరాబాద్, ఏప్రిల్ 28: గత ఎన్నికల్లో ప్రతిపక్ష నేతల ప్రలోభాలకు, ఒత్తిడికి గురై వివిధ పార్టీల్లో చేరిన ఉద్యమకారులు, బీఆర్ఎస్ నాయకులు సొంత గూటికి చేరుకుంటున్నారు. ఆదివారం పాలాటకు చెందిన బీఆర్ఎస్ ఉద్యమకారుడు పాండు, అతని అనుచరులు జడ్పీ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. కూచారంలో నాయకులు మంగ్యానాయక్, ఉదయ్‌రంజన్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో సుధాకర్ బీఆర్ఎస్‌లో చేరాడు.

బీఆర్ఎస్‌లో చేరిన సుధాకర్

ఉద్దేశపూర్వకంగానే సీఎం దుష్ప్రచారం

- రాజ్యాంగ సవరణపై చర్చకు రేవంత్‌రెడ్డి సిద్ధమా..?
- అంబేద్కర్‌ను ఎన్నికల్లో ఓడించింది.. అవమానించింది కాంగ్రెస్
- మెదక్‌లో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు

మెదక్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్

మెదక్, ఏప్రిల్ 28(నమస్తే తెలంగాణ) : దేశంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని ఉద్దేశపూర్వకంగా సీఎం రేవంత్‌రెడ్డి దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు విమర్శించారు. ఆదివారం మెదక్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ...దేశ రాజ్యాంగానికి ఇప్పటికే 106 సార్లు సవరణలు జరిగాయని, కాంగ్రెస్ హయాంలోనే ఎక్కువ సవరణలు జరిగిన విషయాన్ని ఆ పార్టీ నాయకులు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ హయాంలో షాభాను అనే ముస్లిం మహిళలు సుప్రీం ఇచ్చిన మనోవర్తి తీర్పును అప్పటి పాలకులు చింపిపేశారన్నారు. ట్రిపుల్ తలాక్ ఎత్తేసింది మోదీ ప్రభుత్వమని, ముస్లిం మహిళలు ఆలోచించాలన్నారు. మోదీ నినాదం సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీల హక్కుల కోసం మాట్లాడడం తప్ప, ఏ రోజు వారి కోసం ఏమీ చేయలేదని విమర్శించారు. మొదటి రాజ్యాంగ సవరణ ఎప్పుడు జరిగిందో రేవంత్‌రెడ్డికి తెలుసా అని రఘునందన్ ప్రశ్నించారు. దేశంలో బీసీ, ఎస్సీ, ఎస్టీల మీద సర్జికల్ స్ట్రైక్ జరుగబోతున్నదని, సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారం చేస్తున్నాడని ఆరోపించారు. అన్ని వర్గాలను కాపాడుకుంటూ వచ్చింది బీజేపీ అన్నారు. రాజ్యాంగ సవరణ జరుగుతుంది తప్ప రాజ్యాంగ మార్చరాదని స్పష్టంగా ప్రధాని మోదీ చెప్పారని, సాక్షాత్తు రాజ్యాంగం రాసిన డాక్టర్ అంబేద్కర్ మళ్లీ పుట్టినా రాజ్యాంగాన్ని మార్చడం కుదరదని ప్రధాని పేర్కొన్న విషయాన్ని సీఎంతో పాటు కాంగ్రెస్ నాయకులు గుర్తు తె